www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 10 ఫిబ్రవరి 2025
5
అన్నమయ్య

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

పెరిగిన బొప్పాయి సాగు

రైతన్నకు సిరులు - అధిక విస్తీర్ణంలో సాగు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఒకప్పుడు పెరటి మొక్కగా ఉన్న బొప్పాయి, తైవాన్ రకాల రాకతో తోటలను సంతరించుకుంది. దీనిసాగు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల్లో కనిపిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో బొప్పాయి సాగు విస్తీర్ణం 70వేల ఎకరాలకు పైగా ఉంది. ఒకప్పుడు ఇంటి పెరట్లోనో, పొలం గట్లపైనో ఉన్న బొప్పాయికి ఇంతగా ప్రాధాన్యం పెరగటానికి ప్రధాన కారణం అధిక దిగుబడినిచ్చే తైవాన్ రకాలే అని చెప్పక తప్పదు. దీనికితోడు రిటైల్ మార్కెట్లు, సూపర్ మార్కెట్ల రాకతో దీనిసాగు వాణిజ్యరూపును సంతరించుకుంది. ప్రస్తుతం బొప్పాయి అన్ని సీజన్లలో అందుబాటులో ఉండే పండు, ఇతర పండ్లతో పోలిస్తే బొప్పాయిలో కెరోటిన్ అత్యధికంగా ఉంది. విటమిన్లు పుష్కలంగా లభ్యం కావటం, ఆరోగ్యానికి మేలుచేసే వివిధ ఔషధ గుణాలు మెండుగా ఉండడం వల్ల బొప్పాయిని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. ఇప్పుడు దీని వాడకం విస్తృతమవటం, మార్కెట్ డిమాండ్ పెరగటంతో రైతుకు బొప్పాయి సాగు లాభదాయకంగా మారింది. సాధారణ బొప్పాయి రకాలకంటే, తైవాన్, సంకర రకాలు 2 నుంచి 3 రెట్లు అధిక దిగుబడినిస్తుండటంతో బొప్పాయిసాగు మరింతగా విస్తరిస్తోంది. ముఖ్యంగా తైవాన్ రెడ్ లేడీ రకం మొక్కలు పొట్టిగా ఉండటం, పెనుగాలుల తాకిడిని తట్టుకునే స్వభావం ఉండటంతో రైతులకు సాగులో సమస్యలు చాలా వరకు తగ్గుతాయని రైతులంటున్నారు. సాధారణంగా బొప్పాయి నాటిన 9వ నెల నుండి దిగుబడి ప్రారంభమై, మంచి యాజమాన్యం పాటించిన తోటల్లో రెండున్నర సంవత్సరాల నుంచి మూడు సంవత్సరాల వరకు దిగుబడులనిస్తుంది. ముఖ్యంగా బొప్పాయి కోతలు అనేది మనం ఎంచుకున్న రకం, పంపే మార్కెట్లదూరం పైన ఆధారపడి వుంటుంది. లోకల్ మార్కట్లకే కాక ఢిల్లీ, ముంబాయి వంటి ప్రధాన మార్కెట్లను దృష్టిలో ఉంచుకుని, అందుకు తగ్గట్టుగా పంట దిగుబడులు తీస్తున్నారు కొందరు రైతులు. పంపే మార్కెట్ ఏదయినా కోతల సమయంలో కొన్ని మెలకువలు తప్పనిసరి. సాధారణంగా, వినియోగదారులు మధ్యస్థ సైజులో ఉన్న కాయలను ఎక్కువగా ఇష్టపడతారు. కాబట్టి చెట్లపై కాయలు తగిన పరిమాణం రాగానే కోతలు చేయాలని, పూర్తిగా చెట్లపైనే కాయలు పండనీయ కూడదని రైతులు చెబుతున్నారు. ఈపంట సాగులో దిగుబడులు ఆశాజ నకంగానే ఉన్నా, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య తెగుళ్ళు. వీటిని సమగ్ర సస్యరక్షణ చర్యలతో అరికడుతూ, ఎకరానికి 100 టన్నుల దిగుబడులు సాధించిన రైతులూ ఉన్నారు. బొప్పాయిని సాగు చేయటం పైనే కాదు, కోతల అనంతరం కూడా సరైన మెలకువలు పాటించినప్పుడే మంచి రాబడి వస్తుందని రైతులంటున్నారు.



మార్కెట్‌కు పంపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

దూరపు మార్కెట్లకు పంపేటప్పుడు, కాయలపై ఆకుపచ్చ రంగు నుంచి 1,2 పసుపు చారలు రాగానే, కాయలు కోసుకోవాలి. అదే దగ్గరి మార్కెట్లకు పంపేటపుడు కొంచెం మాగిన కాయలను కోసినా సరిపోతుంది. కాయలను కోసిన తర్వాత వాటినుంచి వచ్చే పాలు ఆరిపోయే వరకు నీడలో ఆరబెట్టాలి. లేదంటే కాయలపై మచ్చలుగా ఏర్పడి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంది. ఇలా పూర్తిగా ఆరిన కాయలను ప్యాకింగ్ చేసుకోవాలి.

- చెన్న కృష్ణారెడ్డి, రైతు, లింగాల.

అనుకూలమైన రకాలతో మంచి దిగుబడి

రెడ్ లేడీ, వాషింగ్టన్, కో 1,2,3 రకాలు అనువైనవి. ఒక ఎకరాకు 1000 మొక్కలు నాటాలి. మొక్కలు నాటే సమయంలో గుంతల్లో ప్రతి గుంతకూ పశువుల ఎరువు, 20 గ్రాముల అజోస్పైరిల్లమ్, 20 గ్రాముల ఫాస్ఫో బాక్టీ రియా, 40 గ్రా ముల మైకోరైజాను బాగా కలు పుకొని వేసు కోవాలి. నాటే సమయం జూన్, జులై, అక్టోబర్, నవంబర్ మాసాల్లో నాటుకోవచ్చు. 40 నుంచి 60 రోజుల వయస్సున్న 15 సెంటీమీటర్ల పొడవు గల మొక్కలను సాయంత్రం సమయంలో నాటుకోవాలి.

- మహేశ్వర్ రెడ్డి, రైతు, పులివెందుల.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి లాభాలు

బొప్పాయిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు సాధించవచ్చు. ప్రకృతి సాగు చేయడం వల్ల కాయలు బరువుగా నాణ్యత కలిగి ఉంటాయి. వేసవిలో కూడా బెట్టకు రాకుండా అధిక దిగుబడులు వస్తాయి. ప్రస్తుతం టన్ను రూ.22 వేల వరకు పలుకుతుంది. మార్కెట్లో కిలో బొప్పాయి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. డిమాండ్ లేని సమయంలో కూడా టన్ను రూ.12 నుంచి 15 వేలు ధర పలుకుతుంది.

- జనార్ధన్‌రెడ్డి, రైతు, పులివెందుల.

బూడిద తెగుళ్లు నివారిస్తే మంచి దిగుబడి

బొప్పాయి పంటకి ఎక్కువగా ఆకు మీద నల్లని మచ్చ కలిగిన బూడిద తెగుళ్ల వచ్చే అవకాశం ఉంది. దీనికి తడి సల్ఫర్, సల్ఫర్ డస్ట్, లేదా లైం సల్ఫర్, పొటాషియం బైకార్బోనేట్ వంటివి వ్యాధిని నియంత్రించడంలో సమర్థవంతంగా పనిచేస్తాయి. కానీ అధిక వేడి వాతావరణంలో వీటిని వాడటం వల్ల మొక్కలపై విషపూరిత ప్రభావం చూపిస్తుంది. కొన్ని పరిస్థితులలో బేకింగ్ సోడా, వేప నూనె, సబ్బు ద్రవాలు కూడా వాడవచ్చు. వ్యాధి తీవ్రత అధికంగా చూసుకుంటే మంచిది.

- రాఘవేంద్ర రెడ్డి, ఉద్యానవన అధికారి.

రుగ్మతలపై రచయితలు కలం ఎక్కుపెట్టాలి

- శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విసి ఆచార్య నిత్యానందరావు

ప్రజాశక్తి- కడప అర్బన్

సమాజంలోని రుగ్మతలను ప్రశ్నిస్తూ అభివృద్ధి దిశగా ప్రజలను సమాయత్తం చేయాల్సిన బాధ్యత రచయితలపై ఉందని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విసి ఆచార్య నిత్యానందరావు అన్నారు. కడప నగరంలోని ఐఎంఎ హాల్లో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ' వెయ్యేళ్లతెలుగు సాహిత్యం – రాయలసీమ భాగస్వామ్యం' అనే శీర్షికతో 2వ సాహిత్య సాంస్కృతిక మహాసభలను ఆదివారం సభను కేతు విశ్వనాథరెడ్డి సాహిత్యవేదికపై నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విసి ఆచార్య వెలుదండ నిత్యానందరావు ప్రసంగిస్తూ సాహిత్య సంఘాలు ప్రజల్లో సాహితీ పిపాసను పెంచాలని, ప్రాంతీయ అభివృద్ధి నిమిత్తం చైతన్య స్పృహ రేకెత్తించాల్సిన అవసరం ఉందన్నారు. పాలకులకు సరైన మార్గనిర్దేశం చేయడానికి మరింత ఉత్సాహంతో సానుకూల దృక్పథంతో సాహిత్య సంఘాలు కృషి చేయాలని పేర్కొన్నారు. సభాధ్యక్షులు, వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ అస్తిత్వాన్ని చాటిచెప్పేలా ఈ రెండు రోజుల మహా సభలు విజయవంతంగా నిర్వహించామని అన్నారు. రాయలసీమకు చెందిన భాష, చరిత్ర, సాహిత్యం, సంస్కృతి అంశాలపై అనేక పరిశోధన పత్రాలు, సదస్సుల ద్వారా వెలుగు చూశాయన్నారు. విశిష్ట అతిథి, సంఘం గౌరవ సలహాదారులు అలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ పేరుకు రాయలసీమ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి కూడా కవులు, కళా కారులు పాల్గొనడం, రాయలసీమ ఘనతను చాటడం హర్షణీయమన్నారు.

మాట్లాడుతున్న :నిత్యానందరావు

సంఘం కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్రెడ్డి స్వాగతం పలుకగా సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం వందన సమర్పణ చేశారు. శతాధిక కవి సమ్మేళనంలో కవులు కవితాగానం చేశారు. సంఘం కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి సభా సమన్వయం చేశారు. రాయలసీమ పత్రికా రంగంపై డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, రాయలసీమ సినిమాపై భూమిరెడ్డి స్వరూపరాణి, రాయలసీమ సంస్కృతి, సంప్రదాయాలు అనే అంశంపై పుట్టా ఓబులేసు పత్రాలను సమర్పించారు. వేమన, సుమతి, భాస్కర శతకాలలో పద్యపఠన పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

చేనేతల ఆర్థిక అభివృద్ధికి కృషి

జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి డి.కృష్ణ

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో చేనేత కార్మికులకు, పెన్షన్ దారులకు, వారి కుటుంబాలకు అందుబాటులో ఉంటూ చేనేత ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానని చేనేత కార్మికుల జౌళి శాఖ అధికారి డి. కృష్ణ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో చేనేత కార్మికులు, చేనేత సొసైటీలు, చేనేత అధికారుల పని విధి విధానాల గురించి, చేనేత పెన్షన్ దారులకు, వారి కుటుంబాలకు రాష్ట్ర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు వంటి వాటిపై 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

జిల్లాలో చేనేత అధికారులు, కార్యాలయాల వివరాలు తెలియజేయండి ?

అన్నమయ్య జిల్లాలో రాయచోటిలో జిల్లా చేనేత, జౌళి శాఖ కార్యాలయం ఉంది. ఇందులో ఆరుగురు విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా చేనేత,అబివృద్ధి, సహాయ అభివృద్ధి అధికారులు మొత్తం నలుగురు ఉన్నారు.

చేనేత అధికారుల పని వివరాలు తెలపండి?

జిల్లాలో చేనేత సొసైటీలో ఉన్నటువంటి కార్మికుల అందరికీ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను , అర్హతను బట్టి కార్మికులకు, చేనేతలకు అధికారుల ద్వారా అందజేస్తారు.

జిల్లాలో మగ్గాలు చేనేత కుటుంబాల వివరాలు తెల్పండి ?

జిల్లాలో సుమారుగా 6500 చేనేత మగ్గాల కుటుంబాలున్నాయి. 2100 విద్యుత్ మగ్గాలు ఉన్నాయి. 31 మంది సభ్యులు ఉన్నారు. 85 చేనేత మగ్గాలు, 32 విద్యుత్ మగ్గాలు ఉన్నాయి. వీరబల్లి, పుల్లంపేట, రాజంపేట, చిన్న మండ్యం, మదనపల్లి టౌన్, రూరల్, కురబల కోట, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, మొలకలచెరువు, నిమ్మనపల్లి, కలకడ, పీలేరు ప్రాంతంలో చేనేత పరిశ్రమలున్నాయి.

జాతీయ చేనేత క్లస్టర్ పథకాలు వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లాలో ప్రస్తుతం జాతీయ ఐదు చేనేత క్లస్టర్లు అమలలో ఉన్నాయి. ఇందులో అంగళ్లు, రాజానగర్, నిరుగట్టువారిపల్లి, కొళ్లబైలు చౌడేశ్వరి క్లస్టర్లున్నాయి. చేనేత కార్మికులకు ప్రభుత్వం ముద్రా రుణాలు మంజూరు చేస్తుంది. జాతీయ చేనేత క్లస్టర్ లు ద్వారా చేనేత కార్మికులకు పనిముట్లు అందజేస్తారు. అన్నమయ్య జిల్లాలో మొత్తం 59 చేనేత సహకార సంఘాలున్నాయి.

జిల్లాలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లాలో చేనేత కార్యాలయం సంబంధించిన సిబ్బంది కొరత గతంలో ఉండేది. ప్రస్తుతం ఇటువంటి సిబ్బంది కొరత లేదు. జిల్లాలో చేనేత కార్మికుల కుటుంబాలు ఎవరు కూడా మధ్యవర్తులను సంప్రదించరాదు. చేనేత , జౌళి శాఖ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ , అభివృద్ధి పథకాల కోసం చేనేత కార్మికులు నేరుగా తమ కార్యాలయంలో సంప్రదించాలి.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మంత్రికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - రాయచోటి

మండలంలోని వరిగ, శెట్టివాండ్ల పల్లెలో నూతన బోరుకు మోటర్ బిగించి గ్రామానికి శాశ్వత నీటి సమస్య పరిష్కరించామని రవాణా, యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శెట్టివాండ్లపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రాధాన్యత క్రమంలో బోర్లు వేసి నీటి సమస్య తీరుస్తామని తెలిపారు. వేసవి కాలంలో నీటి సమస్య తలెత్త కుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు .రాబోయే రోజులలో ప్రతి గ్రామానికి నీటి సరఫరా చేసి నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రికి శెట్టి వాండ్లపల్లె గ్రామస్తులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరలో మంత్రి..

చిన్నమండెం : చాకిబండ గ్రామం, అంబా బత్తినవారిపల్లెలోని అనంతపురం గంగమ్మ జాతరలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించిన శ్రీనివాసులు ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్లారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మిట్స్'కు జాతీయ స్థాయిలో ట్రిపుల్ ఎ రేటింగ్

ట్రిపుల్ ఎ రేటింగ్ సర్టిఫికెట్‌ను అందుకుంటున్న పృథ్విరాజన్

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో టాప్ 20 కళాశాలల్లో ట్రిపుల్ ఎ రేటింగ్ లభించిందిని ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. జాతీయ స్థాయిలో ఎన్‌పిటిఇఎల్ వారు ఆన్‌లైన్‌లో జులై–డిసెంబర్ 2024 సెషన్‌లో నిర్వహించిన పరీక్షలలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మొత్తం 7480 సర్టిఫికెట్ కోర్సులకు హాజరయ్యారని అన్నారు. అందులో 5734 ప్రతిభ కనపరిచి జాతీయస్థాయిలో ఎన్‌పిటిఇఎల్ సర్టిఫికెట్‌ను పొందడమే కాక, 90 మందికి గోల్డ్ రేటింగ్, సిల్వర్ 1024, ఎలైట్ 2765 మందికి లభించిందని అన్నారు. అంతే కాకుండా కళాశాలకు ట్రిపుల్ ఎ రేటింగ్‌తో పాటు టాప్ 20లో మిట్స్ కళాశాల 12 వ ర్యాంక్‌గా గుర్తింపును అందించినట్లు ఆయన తెలిపారు. చెన్నైలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్‌లో జరిగిన అవార్డుల కార్యక్రమంలో కళాశాల మెకానికల్ ప్రొఫెసర్ డాక్టర్ పృద్వి రాజన్ ఈ అవార్డు ను అందుకున్నట్లు ఆయన తెలిపారు. కళాశాలకు ఎన్‌పిటిఇఎల్ వారు అందించిన ఈ గుర్తింపునకు కృషి చేసిన విద్యార్థులు, అధ్యాపకులు చేసిన కృషికి కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల కృతజ్ఞతలు తెలిపారు.

బడ్జెట్‌లో సీనియర్ సిటిజన్లకు ఊరట

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్–2025లో మధ్యతరగతి సీనియర్ సిటిజన్లకు ఊరటనిచ్చిందని సిటిజన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎన్.మునిగోపాల కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జి.ఆర్.టి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో ఎపి సీటిజన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కే.శే. అంకిరెడ్డి, రాజగోపాల్, వాసు దేవయ్యలకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ 2025–26 బడ్జెట్‌లో ఆర్థక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ మధ్య తరగతి సీనియర్ సిటిజన్లకు ఆదాయ పరిమితిని రూ.12 లక్షలకు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 90శాతం మంది విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు ఇది ఒక వరంగా భావించ వచ్చునన్నారు. 70 ఏళ్లు నిండిన వయోవృద్ధులకు ఆయుష్మాన్ యోజన పథకము ఒక వరమని అన్నారు. రూ.5 లక్షల వరకు ఉచిత ఆరోగ్యబీమా వలన కోట్ల మంది సీనియర్ సిటిజన్స్ కు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి కరుణాకర్, కోశాదికారి ఉస్మాన్ సాహెబ్, ఆర్గనైజర్ కృష్ణమూర్తి, సలహాదారులు ప్రొఫసర్ శ్రీనివాసులు, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు నాగరాజు, ధనలక్ష్మి, కృష్ణమూర్తి, ప్రేమ, రాజేంద్ర , సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మునిగోపాలకృష్ణ

రెండు క్వింటాళ్ల బియ్యం వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థకు ఎబిసి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి ఆదివారం చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థను సందర్శించి, ముత్తు ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థుల భోజనాల కోసం రెండు క్వింటాళ్లు బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మనిషి పుట్టుక సాధారణమని కాని వారి మరణం మాత్రం చరిత్రలో నిలిచిపోవాలని ఆకాంక్షించారు. ఆ విధంగానే మనమంతా సమాజంలో మెలగాలని హితవు పలికారు. సంస్థ అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తా మన్నారు. చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందన్ మాట్లాడుతూ అప్పినపల్లి భాస్కరాచారి ప్రతి ఏడాది అనవాయితీగా జన్మదిన వేడుకలను సంస్థ పిల్లలు మధ్య జరుపుకోవడమే కాకుండా సంస్థ అవసరాలను గుర్తించి సహాయ పడుతుతున్నారని పేర్కొన్నారు. ఇలాగే ఆయన సహకారం కొనసాగించాలని ఆకాంక్షించారు. భాస్కరాచారికి సంస్థ జ్ఞాపికను సంస్థ సెక్రటరీ కవితారాణి అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి పట్నం గిరిజమ్మాల్, చిన్నారులు, ఆనంద వృద్ధాశ్రమ వృద్ధులు సిబ్బంది పాల్గొన్నారు.

'ఆదిత్య'లో మహిళా ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

పట్టణంలోని స్థానిక పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల లోని ఉమెన్ ఎంపొవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్త లపై అవగాహన కల్పించారు. రుతుక్రమ సమయంలోఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి శానిటరీ ప్యాడ్స్ వాడాలి, వాటివల్ల కేన్సర్ రాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై అనంత్, జయశ్రీ అనంత్‌లు వివరించి చెప్పారు. సోషల్ ఎంటర్‌ప్రైనర్‌ఐన ఫ్రమ్ ఫెమినైన్ సోషల్ ఆర్గనైజేషన్ ద్వారా ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లుకళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు.కార్యక్రమంలో మహిళా ఫ్యాక ల్టీలు, విద్యార్థులు ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్ బాబు, ఇతర విభాగాల మహిళా ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

విసికె, బాస్ బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణ విసికె, బాస్ కమిటీల సంయుక్త సమావేశం ఆదివారం స్థానిక తాళ్లవారివీధి లోని సిపిఐ కార్యాలయంలో జరిగింది. బాస్ జిల్లా కార్యదర్శి పెద్దపాలెం రవిశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి విసికెపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ ముఖ్య అతిధిగా హాజరై బాస్, విసికెలను బలోపేతం చేయడం ద్వారా బుద్ధ, బసవ, పూలే, పెరియార్, అంబేడ్కర్ వంటి మహనీయుల ఆశయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చునని అన్నారు. తద్వారా ప్రజల్లో సౌభ్రాతృత్వాన్ని, దేశభక్తిని పెంపొందించి, దేశాన్ని సమసమాజ నిర్మాణం వైపుకు వేగంగా మలుపు తిప్పవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివప్రసాద్ సమక్షంలో విసికె, బాస్ లకు మదనపల్లె పట్టణ అధ్యక్షులను ఎన్నుకున్నారు. విసికె పార్టీ అధ్యక్షులుగా బురుజు రెడ్డిప్రసాద్, బాస్ అధ్యక్షుడిగా పఠాన్ ఇర్ఫాన్ ఖాన్‌లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన బాస్, విసికె పట్టణ అధ్యక్షులకు నాయకులు, సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమను విశ్వశించి పట్టణ అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించినందుకు బాస్ అధినేత శివప్రసాద్ కు, సమావేశంలో పాల్గొన్న సభ్యులకు కృతజ్ఞతలు చెప్పారు. తమపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి, సంస్థల ఉన్నతికి అవిశ్రాంతంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, ముత్యాల మోహన్, రవిశంకర్, వై. చిన్నా, తలారి కృష్ణ, జనార్దన్, వై. గంగాధర్, జీవీ రమణ, దేగాని రమణ, రాయల్ సూరి, సద్దల శశికుమార్, రెడ్డిశేఖర్, ఈశ్వర్, బి.నరసింహులు, బైనేని సురేష్, సి.కళ్యాణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివప్రసాద్

మైనార్టీల అభివృద్ధి కూటమితోనే సాధ్యం :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముస్లిము మైనారిటీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టిడిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం మన్నూరు ఈద్గా వద్ద సుమారు రూ.5 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ముస్లిము మైనారిటీలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఫలితంగా ముస్లిం మైనారిటీలు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. కూటమి ప్రభుత్వం ముస్లిం మైనారిటీల అభివృద్దే లక్ష్యంగా గల్ఫ్ బాధితుల కోసం పరిశ్రమలు ఏర్పాటు చేసి వారికి ఉపాధి అందించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ నాయకులు చమర్తిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్‌రాజు, టిడిపి రూరల్ మండల అధ్యక్షులు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి అబూబకర్, కౌన్సిలర్ మిరియాల చెంగమ్మ, కమ్మ సంఘం జిల్లా అధ్యక్షులు శివ నారాయణ చౌదరి, టిడిపి పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అనసూయదేవి పాల్గొన్నారు.

సిసి రోడ్డును ప్రారంభిస్తున్న జగన్మోహన్‌రాజు

వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి-పీలేరు : వినియోగదారుల అర్జీల ద్వారా విన్నవించుకున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తహశీల్దార్ భీమేశ్వరరావు తెలిపారు. ఆదివారం వారాంతపు సెలవు ఉన్నప్పటికీ రెవెన్యూ సిబ్బంది విధులకు హాజరయ్యారు. ఇటీవల క్షేత్రస్థాయిలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు, ప్రజల నుంచి అందిన ఆర్జీలను డిప్యూటీ తహశీల్దార్ రెడ్డప్పరెడ్డి పర్యవేక్షణలో ప్రజల విన్నపాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు తాము తమ సిబ్బంది కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో కొందరు రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడ్డారని స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆరోపిస్తూ విచారణ కోసం జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుతో, జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు కూడా రెవెన్యూ ఉద్యోగులు అందుకు సంబంధించిన దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ వాటిని భద్రపరుస్తున్నట్లు తెలుస్తోంది.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

నిరుపయోగంగా మరుగుదొడ్లు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా మరుగుదొడ్లు నిర్మించి వాటిని వినియోగంలోకి తేకుండా అలాగే వదిలేశారు. కార్యాలయంలో తహశీల్దార్‌తో పాటు మహిళా ఉద్యోగులు, ఇద్దరు మహిళా విఆర్ఒలు, 11 మంది గ్రామ సర్వేయర్లు మహిళలే ఉన్నారు. తహశీల్దార్ కార్యాలయానికి పనుల కోసం చాలా మంది మహిళలు వస్తూ పోతుంటారు. మరుగుదొడ్లు వినియోగంలో లేకపోవడంతో మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో పక్కనే ఉన్న ఎంపిడిఒ కార్యాలయంలో ఉండే మరుగుదొడ్లను వినియోగించు కుంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులుగానీ, స్వచ్ఛంద సంస్థలైన స్పందించి మరుగుదొడ్లను వినియోగంలో తీసుక రావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విజేతగా నిలిచిన సునీల్ లెవెన్స్ జట్టు

క్రికెట్ టోర్నీ విజేత సునీల్ లెవెన్స్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోనిఎకెఎస్ జ్యువెలర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఫైనల్లో గౌతమ్ లెవెన్స్ టీమ్‌పై సునీల్ లెవెన్స్ టీమ్ విజయం సాధించింది. ఎకెఎస్ జ్యువెలర్స్ వారు విజేతలకు రూ.50 వేలు నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా సునీల్ లెవెన్స్ టీం సభ్యులు మాట్లాడుతూ సెమీస్ నుంచి హోరాహోరీగా పోటీ ఉన్నప్పటికీ ఎటువంటి ఇబ్బంది పడకుండా గౌతమ్ లెవెన్స్ టీమ్ చేసిన 73 పరుగులు లక్ష్యాన్ని చేదించేందుకు సునీల్ టీమ్ బరిలోకి దిగగా మొదటి ఓవరులోనే మూడు వికెట్లు నష్టపోయినప్పటికీ ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా సునీల్ లెవెన్స్ టీమ్ విజయం సాధించింది. టోర్నమెంట్ నిర్వహించిన జ్యువెలర్స్ వారికి సునీల్ లెవెన్స్ టీమ్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

యూసఫ్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

షూటింగ్ బాల్ క్రీడాకారుడికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

భారత షఉటింగ్ బాల్ క్రీడాకారుడు మహమ్మద్ యూసుఫ్‌కు తంబళ్లపల్లెలో ప్రజలు, యువత ఘన స్వాగతం పలికారు. నేపాల్‌లో జరిగిన 2వ ఆసియన్ షూటింగ్ బాల్ ఛాంపియన్ షిప్ గెలిచిన భారతజట్టులో యూసుఫ్ సభ్యుడు. భారత్‌కు కప్పు అందించి మొదటిసారిగా తంబళ్లపల్లెలో అడుగు పెట్టాడు. శాలువ, పూలమాలలతో సన్మానించారు. పెద్ద ఎత్తున బాణా సంచా పేలుస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కేకు కట్ చేసి సంబరాలు చేశారు.

ఫలితాలు విడుదల చేయాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

2023 అక్టోబర్‌లో జరిగిన ఢిల్లీ స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో కొన్ని ఫలితాలు మాత్రమే విడుదల చేశారని, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నవాటిని విడుదల చేయాలని జిడిఎస్ ఉద్యోగులు కోరారు. ఆ మేరకు ఆదివారం పోస్టల్ శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిశారు. మంత్రి ఈ విషయాన్ని బాధ్యతగా స్వీకరించి అధికారులతో చర్చించారని, త్వరలోనే ఫలితాలు విడుదల చేపిస్తామని ఆయన తెలిపారని ఉద్యోగులు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస బాడ్జి, ప్రదీప్, నాగరాజు, సురేంద్ర, శ్వేత, మోహన్‌రెడ్డి, నారాయణ, జిడిఎస్ ఉద్యోగులు ఉన్నారు.

మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్: రాయలసీమ ప్రాంతంలో మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. స్థానికంగా తన నివాసంలో ఆదివారం తిరుపేల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతంలో అపార ఖనిజ సంపద ఉందని, ఈ ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు మైనింగ్ విశ్వవి ద్యాల యం ఎంతో తోడ్పాటునిస్తుందన్నారు. మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉద్యోగ ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. 2014 రాష్ట్ర విభజన సందర్భంగా ఇంతవరకు ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో నెరవేరలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎయిమ్స్, రైల్వేజోన్ మరికొన్ని ఇతర ప్రాంతాలకు వెళ్లాయన్నారు. పెద్ద పరిశ్రమలు లేకపోవడం వల్ల రాయలసీమ ప్రాంతవాసులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల మధ్య పరస్పర సహకారం ఉన్నందున విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చొరవ చూపాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందన్నారు. అధికార పార్టీ నాయకులు సిఎంపై ఒత్తిడి తీసు కొచ్చి మైనింగ్ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన కోరారు.

అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలి

ప్రజాశక్తి - వేంపల్లె : ఎపి రాజధాని అమరావతిని ఫ్రీ జోన్‌గా కూటమి ప్రభుత్వం ప్రకటించాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్య, ఉద్యోగాల్లో స్థానిక, స్థానికేతర్లకు సంబంధించి రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించారని చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు 1వ జోన్‌లో, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలు 2వ జోన్‌లో, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు 3వ జోన్‌లో, కడప, కర్నూల్, అనంతపురం, చిత్తూరు జిల్లాలు 4వ జోన్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. రాజధాని అమరావతి 3వ జోన్ పరిధిలోకి వస్తుందన్నారు. రాజధాని ప్రాంతంలో విద్య, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. రాజధాని అన్ని ప్రాంతాలకు సంబంధించిందని, అక్కడ అన్ని ప్రాంతాల వారికి సమాన అవకాశాలు లభించాలంటే ఆ ప్రాంతాన్ని ఫ్రీ జోన్‌గా ప్రకటించడం సమంజసమని పేర్కొన్నారు.

కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు మంజూరు చేసిన గుర్తింపు కార్డులను లేబర్ ఆఫీస్ ఇన్‌ఛార్జి అల్లాబకష్, భవన నిర్మాణ కార్మిక సం ఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పంపిణీ చేశారు. ఆదివారం వేంపల్లెలో అల్లాబకష్ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ బోర్డు నుండి గుర్తింపు కార్డులు కార్మికులకు ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కోశాధికారి నాగేశ్వరరావు, దస్తగిరి పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించరూ..!

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులో పెద్దూర్ రోడ్డు నుంచి దిగువ పల్లికి వెళ్లే దారిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండటంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వేళల్లో బస్సులు, ఆటోలు, స్కూల్ బస్సులు, ద్విచక్ర వాహనాలతో రోడ్డు రద్దీగా ఏర్పడి ట్రాఫి క్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని వాహనదారులు ఆందోళన చెందు తున్నారు. వాహన రాకపోకలు ఒకే రోడ్డుపై సాగడం, రోడ్డుకు ఇరువైపు కొందరు ఆర్‌అండ్‌బి స్థలాన్ని ఆక్రమించు కోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమైందని చెబుతున్నారు. ఆక్రమణలు తొలగింపునకు ఆర్ అండ్‌బి అధి కారులు సర్వే చేసి ఆరు సంవత్సరాలు అవుతున్న ఇంతవరకు వాటిని మార్కింగ్ ఇచ్చారు కానీ చర్యలు తీసుకోలేదని అన్నారు. బుధ, గురువారాల్లో సంతలతో ట్రాఫిక్ సమస్య అధికమవుతుందని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పెద్దూర్ రోడ్డులో నిలిచిన వాహనాలు

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన

కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న రూపానందరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని ఎస్‌బివిడి సభ క్రీడా ప్రాంగణంలో ముక్కారూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ అరవింద కంటి ఆస్పత్రి వారి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాదాపు 3 వేల మంది రోగులకు ఓపి ఇవ్వడం జరిగిందని సాయి వికాస్ రెడ్డి తెలిపారు. 300 మందికి పైగా కంటి ఆపరేషన్‌కు ఎంపిక అవడం జరిగిందని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహణకు విశేష జన ఆదరణ రావడం జరిగిందని చెప్పారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినందుకు ప్రతి ఒక్కరికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కూడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా వరలక్ష్మి, యువ నాయకుడు సాయి వికాస్‌రెడ్డి, సాయివిశాల్‌రెడ్డి, శిరీషరెడ్డి, మండల అధ్యక్షుడు సుధాకర్7 నాయుడు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌నాయుడు, జనసేన నాయకుడు పసుపులేటి వెంకటరమణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో యంగ్ ఇండియా ఫౌండేషన్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని శ్రీచైతన్య చిల్డ్రన్స్ అకాడమీ నందు నిర్వహించిన ఉచిత కేన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభిం చినట్లు యంగ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజ శేఖర్ తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన ఈ వైద్యశి బిరంలో రొమ్ము, గర్భాశయ కేనన్సర్ స్క్రీనింగ్ వైద్య నిపుణులు నుంచి స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థ, ప్రోస్టేట్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్ పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఆరుగురికి కేన్సర్ పాజిటివ్ కాగా ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని డాక్టర్ కిరణ్ చెప్పారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది డాక్టర్ కిరణ్, హరీష్ లోకేష్, బి.కొత్తకోట మెడికల్ ఆఫీసెర్ డాక్టర్ కిరణ్ కుమార్, మాజీ సర్పంచ్ కుడుము శ్రీనివాసులు, కనకంటి ప్రసాద్, రాజా, సురేంద్ర బాబు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సాహితీ సంస్కృతుల సీమ మన రాయలసీమ

-స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సాహితీ సంస్కృతుల సీమ మన రాయలసీమ అని రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ అన్నారు. కడప నగరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం కడపజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం రాయలసీమ భాగస్వామ్యం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శంకర్ మాట్లాడుతూ మనము ఎన్ని భాషలు నేర్చుకున్న మాతృభాష తెలుగు అధ్యయనమే అభ్యుదయానికి మార్గమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ ఇడి వల్లూరు బ్రాహ్మయ్య, యోగివేమన విశ్వావిద్యాలయ ఆచార్యులు డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ మల్లి ఖార్జునరెడ్డి, అవధాని అమూదాల మురళి, పోతన సాహిత్య పీఠం కార్యదర్శి నారాయణరెడ్డి, రచయితలు వెంకటేశ్వరచారి, నీలవేణిరెడ్డి, శేఖరరెడ్డి, చదువులబాబు, రమణారెడ్డి మాట్లాడారు.

మాట్లాడుతున్న పసుపులేటి శంకర్

సన్మానం అందుకుంటున్న వెంకటరమణ

'గంగనపల్లి'కి సన్మానం

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు పండితులు, కవి గంగనపల్లి వెంకటరమణ ఘన సన్మానం అందుకున్నారు. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం-రాయలసీమ భాగస్వామ్యం' అనే పేరుతో వైయస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న రెండవ సాహిత్య సాంస్కృతిక మహాసభలలో గంగనపల్లి వెంకటరమణ పాల్గొని కవితా గానం చేశారు.మన రాయలసీమ చరిత అనే శీర్షికతో ఆయన రచించిన పద్య కవితలను సభాముఖంగా వినిపించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

పద్యకవి జలకనూరికి..

పీలేరు: పీలేరు వాసి, పద్యకవి జలకనూరి మురళీధర్‌రాజుకు ఘన సత్కారం లభించింది. వైయస్సార్ జిల్లా రచయితల సంఘం పిలుపు మేరకు కడప, శంకరాపురంలోని ఐయంఎ హాలులో ఫిబ్రవరి 8,9 తేదీల్లో రెండు రోజుల పాటు "వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం – రాయలసీమ భాగస్వామ్యం" సాహిత్య, సంస్కృతిలో రాయలసీమ వైభవం అనే అంశాలపై కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో పీలేరుకు చెందిన జలకనూరి మురళీధర్ రాజు రాయలసీమ, కవులు, భాష, యాస, పండుగలు, ఆచార వ్యవహారాలు, శాసనాలు, స్వాతంత్ర్య సమరయోధులు కళాకారులు, శ్రామిక జీవన విధానాలపై నా రాయల సీమ రతనాల సీమ అనే పద్యాన్ని పద్యగానంతో అందరినీ మంత్ర ముగ్ధులను చేశారు. రాయల సీమ కవులు, శ్రీకృష్ణ దేవరాయలు, అల్లసాని పెద్దన, నాచన సోమన, అన్నమయ్య, వేమన, వీరబ్రహ్మం మొదలగు వారిపై ఆట వెలది, కందము, సీస పద్యాలు రాసి వినిపించారు. ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు, కవులు జింకా సుబ్ర మణ్యం, అధ్యక్షులు మూల మల్లికార్జున్ రెడ్డి, ఆచార్య వెలుగొంద నిత్యానందరావు, గానుగ పెంట హనుమంతరావు చేతుల మీదుగా శాలువా సన్మానించి, జ్ఞాపిక, ప్రశంసా అందించారు.

సన్మానం అందుకుంటున్న వెంకటరమణ

టెంకాయ, తమలపాకు ధరలకు రెక్కలు

టెంకాయ రూ.40-రూ.50, తమలపాకుల కట్ట ధర రూ.180 - సామాన్య ప్రజలు విలవిల

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కొబ్బరికాయ (టెంకాయ), తమలపాకుల ధరలు విపరీతంగా పెరిగాయి. పర్వదినాల్లో వీటిని కొనాలంటే సామాన్య ప్రజలు జంకుతున్నారు. ప్రస్తుతం మాఘమాసంలో పూజలు, వివాహాలు, గృహ ప్రవేశాలు అధికంగా చేపడుతారు. గుడికి వెళ్లాలంటే పూజా సామగ్రితోపాటు రెండు టెంకాయలు కొనాలంటే వంద చాలడం లేదు. గతంలో టెంకాయల అంగళ్లలో రూ.15 నుంచి రూ.20 వరకు ధర ఉండేది. ప్రస్తుతం కాయ సైజును బట్టి రూ.40 నుంచి రూ.50 విక్రయిస్తున్నారు. స్థానికంగా తోటల్లో కాయలు లేకపోవడంతో కర్ణాటకలోని తుమకూరు, టిపూర్, హిరియూరు, చిత్రదుర్గ, పావగడ, గౌరీబిదనూరు తదితర ప్రాంతాల నుంచి కొబ్బరికాయలు కొని తీసుకొస్తున్నారు. తోటల వద్దనే వంద కాయలు రూ.2,500 ధర పలుకుతోందని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం చలికాలంలో ఆకుల దిగుబడి అంతంత మాత్రమే ఉంటుంది. ఎండా కాలంలో ఎకరా తోటకు ఎనిమిది నుంచి పది పెండీ(100 కట్టలు ఒక పెండీ)ల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం మూడు నుంచి నాలుగే వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఆకులు దిగుబడి రాకపోవడంతో మార్కెట్లో వాటి ధర గణనీయంగా పెరిగింది. పెండీ ధర రూ.16 వేల నుంచి రూ.18వేలు. వంద ఆకుల కట్ట రూ.180 ధర పలుకుతోంది. విడిగా ఒక ఆకు ధర రెండు రూపాయలకు అమ్ముతున్నారు.

కొబ్బరికాయలు, తమలపాకులు

రహదారుల అభివృద్ధికి తోడ్పడండి

- కేంద్ర సహాయ మంత్రిని కోరిన ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్: పులివెందుల నియోజకవర్గంలో రహదారులు, డ్రయినేజీ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి తోడ్పడాలని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆదివారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమసాని చంద్రశేఖర్‌ను కోరారు. గుంటూరులోని మంత్రి స్వగృహంలో ఎమ్మెల్సీ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పులి వెందుల సమస్యల వివరించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పం దిం చారని, పులివెందుల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ తెలిపారు. అనంతరం మంత్రిని ఘనంగా సన్మానించారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సతీమణి ఉమాదేవి పేర్కొన్నారు. పట్టణంలోని వారి స్వగృహంలో ఆదివారం నియోజకవర్గంలోని లబ్ధిదారులకు రూ.12,73,438 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. పట్టణ పరిధిలోని పెద్ద రంగాపురం గ్రామానికి చెందిన వివేకానందరెడ్డి యాదవ్‌కు రూ.1,06,901, ప్రశాంతి నగర్‌కు చెందిన చిన్నపల్లి నారాయణకు రూ.3,00,000, వేంపల్లి మండలం బక్కన్నగారి పల్లి గ్రామానికి చెందిన ఆవుల మహేష్ బాబుకు రూ.1,07,682, వేంపల్లి గ్రామానికి చెందిన డక్కా మునీంద్రకు రూ.1,05,425, మన్నేరు నాగమునికి రూ.76,000, తొండూరు మండలం మడూర్ గ్రామానికి చెందిన ఎల్లారెడ్డిగారి వీరారెడ్డికి రూ.40,000, నరెడ్డి రామాంజనేయరెడ్డికి రూ.94,957, లింగాల మండలం పెద్దకూడాల గ్రామానికి చెందిన చిత్ర నాగలింగంకు రూ.81,662, చక్రాయపేట మండలం మహదేవపల్లి గ్రామానికి చెందిన కొప్పర్తి వెంకట కొండారెడ్డికి రూ.1,80,246, నల్లగారి వెంకట్‌రెడ్డికి రూ.1,33,600, సుంకిరెడ్డి ప్రసాద్ రెడ్డికి రూ.46,965 చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కల్లూరులో వైఎస్ఆర్ విగ్రహానికి నిప్పు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలం పరిధిలోని కల్లూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. విగ్రహం పాక్షికంగా దెబ్బతింది. తెల్లవారి విషయం తెలియడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. గ్రామంలో విచారణ చేపట్టిన పోలీసులు ఎవరైనా ఆకతాయిలు ఈ పని చేశారా, ఉద్దేశపూర్వకంగానే చేశారా అనే కోణంలో ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

చిన్నారులను అభినందిస్తున్న యల్లటూరు

స్కేటింగ్ ఛాంపియన్లను అభినందించిన 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మధురైలో జరిగిన జాతీయ స్కేటింగ్ ఛాంపియన్స్ పోటీలలో స్వర్ణ పతకాలు సాధిం చిన రాజంపేటకు చెందిన అండర్-4 విజేత ఎం.లక్ష్మీ స్నేహిత, అండర్-6 విజేత టి.సౌర్యసింహను జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు అభినందించారు. ఆదివారం ఎల్లమ్మ ఆలయం సమీపంలోని యల్లటూరు భవన్‌లో వారిని అభినందించి బహుమతులు అందించారు. భవిష్యత్తులో మరిన్నీ పతకాలు సాధించి దేశానికి గర్వకారణంగా నిలవాలని చిన్నా రులను ఆశీర్వదించారు. కోచ్ వినోద్‌కుమార్‌ను అభినందించి ఇటువంటి విద్యార్థులను ఇంకా అధిక సంఖ్యలో తీర్చిదిద్దాలని, తన సహకారం ఎప్పుడూ వుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోలాటం హరి పాల్గొన్నారు.

'వెలిగల్లు'లో పిచ్చి మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక వెలిగల్లు ప్రాజెక్టు పరిధిలోని రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగి పోయిన ముళ్ల పొదలు, గడ్డి, బోధ పిచ్చి మొక్కలను వెలిగల్లు ప్రాజెక్టు సిబ్బంది లస్కర్ల ద్వారా శుభ్రం చేశారు.ఆరుగురు సిబ్బంది ఉండడం ద్వారా వారిని ఈ విధంగా ఉపయోగించుకుంటున్నామని ప్రాజెక్టు ఇఇ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఇ భాస్కరరావు, ఎఇ సాంబశివుడు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

మృతదేహాలు బంధువులకు అప్పగింత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లాలోని తంబళ్లపల్లి నియోజకవర్గం, ములకలచెరువులో శనివారం మధ్యాహ్నం లారీ ఢీకొని మదనపల్లె ప్రశాంత్ నగర్‌కు చెందిన తండ్రి, బిడ్డలు సోమశేఖర్, రెడ్డిశేఖర్, సిద్దేశ్వరి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి కోమలోకి చేరుకున్న బాధితురాలు మృతుని భార్య కవితను కుటుంబీకులు తిరుపతి రూయా ఆస్పత్రికి తరలించగా అక్కడ ఐసియులో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడుతోంది. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తండ్రి, బిడ్డల మృత దేహాలకు మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్లు ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. సాయంత్రం పోలీసులు బి. కొత్తకోట మండలం ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్ సమీపంలోని కుమ్మరపల్లిలో ఉండే మృతుని అన్న రాజశేఖర్‌కు తండ్రి, బిడ్డల మృతదేహాలను అప్పగించారు. మృతదేహాలను తీసుకున్న బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. మండలానికి వెళ్లి బరువెక్కిన హృదయాలతో వారికి అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో కుమ్మరి పల్లెలో తీవ్ర విషాదం అలుముకుంది.

12న మాతంగ మహర్షి, సంత్ రవిదాస్ జయంతి

ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ఈనెల 12న మాతంగ మహర్షి, సంత్ రవిదాస్ జయంతి నిర్వహిస్తున్నామని ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రా భద్రాదిగా పేరు గాంచిన ఒంటిమిట్టలోని ఆది జాంబవంతుడి 50 అడుగుల విగ్రహ ప్రాంగణంలో 12న మాతంగ మహర్షి, సంత్ రవిదాస్ జయంతి నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథులుగా మడకశిర ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ ఎం.ఎస్.రాజు, లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, మాతాంగ మహాపీఠం పీఠాధిపతి నూకల రవీంద్రస్వామి విచ్చేయనున్నారని వివరించారు. పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏకశృంగ పర్వతంపై జాంబవంతుడి మహా సంస్థానం ఏర్పాటు చేయాలన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-కలకడ

భూ తగాదాలతో వ్యక్తిపై హత్యాయత్నం చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచార మేరకు వివరాలు..మండలంలోని ఎర్రకోటపల్లి పంచాయతీ గొల్లపల్లికు చెందిన సుధాకర్ ఈనెల 7న మూత్ర విసర్జనకు వెళ్లే వస్తున్న సమయంలో, అదే గ్రామానికి చెందిన వేమ నారాయణ తాను తీసుకొచ్చిన పెట్రోలను సుధాకర్ పై పోసి నిప్పు అంటించినట్లు తెలిపారు. వీరికి గతంలో భూతగాదాలు ఉన్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో సుధాకర్ పై వేమ నారాయణ పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు తెలిపారు. సుధాకర్ కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారు వచ్చి అతని కాపాడి ప్రయివేట్ వాహనంలో పీలేరు తరలించి, అక్కడ నుంచి తిరుపతి రుయా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి పట్టణంలోని నారాయణాద్రి వైద్యశాలకు తరలించి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. క్షతగాత్రుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి-చిన్నమండెం

రాయచోటి-మదనపల్లి ప్రధాన రహదారి పైన చిన్నమండెం సబ్‌స్టేషన్ వద్ద గురువారం రాత్రి 10 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నమండెంకు చెందిన పసల సన్నీ(17) తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రూయ ఆస్పత్రికి తరలించి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. సన్నీ తన తల్లిదండ్రులకు ఒకే కుమారుడు కావడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. చిన్నమండెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

వీధి కుక్కల దాడి చేసి ఉంటాయని పోలీసుల అనుమానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనుమానాదస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం కురబలకోట మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ముదివేడు పంచాయితీ, పడమటి దళితవాడకు చెందిన కురేసి కృష్ణప్ప (55) కూలి పనులతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ముదివేడు క్రాసుకు వెళ్లాడు. మద్యం సేవించి రాత్రి పొద్దు పోయాక ఇంటికి బయలుదేరాడు. దారిలోని వ్యవసాయ పొలాల్లో మత్తు కారణంగా నిద్రకు ఉపక్రమించినట్లు ఉన్నాడు. అర్ధ రాత్రిలో వీధి కుక్కలు కృష్ణప్పని చుట్టుముట్టి దాడి చేసి ఉంటాయని, వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుడు ఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచినట్లు అనుమానం వ్యక్తం చేశారు ఆదివారం ఉదయం దారిని వెళుతున్న బాటసారులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు మృతదేహం వద్దకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించడంతో డిఎస్‌పి కొండయ్య నాయుడు, సిఐ సత్యనారాయణ, ఎస్ఐ దిలీప్ కుమార్ మృతదేహాన్ని పరిశీలించి క్లూస్ టీం డాగ్ స్క్వాడ్ ఆధారంగా అన్ని రకాలుగా తనిఖీలు చేశారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో కుక్కల దాడి వల్లే చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. అనుమానస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.